సాక్షి
కాకినాడ
మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



రుణగొణ ధ్వనులకు మంగళం


పొదుపు సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉండనున్నాయి. పొందే రుణాలు, వారు చెల్లిస్తున్న వడ్డీ, పొదుపు వివరాల్లో పూర్తి పారదర్శకత చోటు చేసుకోనుంది. - 8లో▸



ఘనంగా వైదిక కార్యక్రమాలు

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే వైదిక పరమైన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఈఓ అజాద్ ఆదేశించారు. - 8లో▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం డెల్టా కాలువలకు 3,250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు 650, పశ్చిమ డెల్టాకు 1,800 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

తుని రూరల్: గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈ నెల 28 వరకు పొడిగించినట్టు తుని మండలం జగన్నాథగిరి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 24తో గడువు ముగిసిందని, దీన్ని ప్రభుత్వం 28 వరకూ పొడిగించిందన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆసక్తి గల అభ్యర్థులు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బిళ్లనందూరుకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న బిళ్లనందూరు సర్పంచ్ బొత్స మంగ

కోటనందూరు: పరిశుభ్రత–పచ్చదనం పెంపొందించడంలో విశేష కృషి చేసిన కోటనందూరు మండలం బిళ్లనందూరు గ్రామపంచాయతీకి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు దక్కింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో బిళ్లనందూరు సర్పంచ్ బొత్స మంగను పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎ.సూర్యకుమారి శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాన్ని అన్ని విభాగాల్లో అభివృద్ధి చేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొత్స సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి పృథ్వి పాల్గొన్నారు.

డీఎస్సీ- 98లో మిగిలిన వారికీ నియామక అనుమతి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): డీఎస్సీ–98లో మిగిలిన అభ్యర్థుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ సోమవారం తెలిపారు. జాబితాలో ఉన్న 285 సెకండరీ గ్రేడ్ అభ్యర్థులలో ఇప్పటికే 260 మందికి నియామక ఉత్తర్వులు ఇచ్చామన్నారు. మిగిలిన అభ్యర్థులు మినిమం టైం స్కేల్ ద్వారా పనిచేయడానికి అంగీకరిస్తే ఈ నెల 27న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. అభ్యర్థుల జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

రెండు కుటుంబాలకు భూమి పంపిణీ



పట్టాను అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో మరణించిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలకు జీవనోపాధి సహాయంగా ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి పట్టాలను సోమవారం ఆయా కుటుంబాలకు కలెక్టర్ కృతికా శుక్లా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం యాత్రకు బస్సు సర్వీసులు

అమలాపురం రూరల్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలాపురం డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి, విజయవాడ ప్రాంతాలలోని దేవాలయాల దర్శనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే మూడో తేదీన అమలాపురం డిపో నుంచి బస్సు బయలుదేరి క్షేత్రాలు దర్శించటంతోపాటు ఐదో తేదీ శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత ఏడవ తేదీ ఆదివారం తిరిగి అమలాపురం వస్తుందన్నారు. పుష్ బ్యాక్ 2 ప్లస్ 2 సిట్టింగ్ కలిగిన సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామన్నారు. పెద్దలకు సూపర్ లగ్జరీ బస్సుకు టికెట్ ధర రూ.2,950, పిల్లలకు రూ.2200, ఇంద్రా ఏసీ బస్సుకు పెద్దలకు రూ.4,000, పిల్లలకు రూ.3,000 గా నిర్ణయించామన్నారు. వివరాలకు 7013868687, 9959225576, 9959225550 నంబర్లలో సంప్రదించవచ్చునని తెలియజేశారు.

జీరో మలేరియా దిశగా..

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మలేరియాపై పైచేయి
- ప్రత్యేక చర్యలతో గణనీయంగా తగ్గిన కేసులు
- నేడు అంతర్జాతీయ మలేరియా నివారణ దినోత్సవం



ఇంటి గోడలపై ఐఆర్ఎస్ పిచికారీ



మలేరియా బాధిత బాలుడి ఆరోగ్య స్థితిపై ఆరా తీస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి



డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మలేరియా నివారణకు ప్రభుత్వ చొరవ, అధికారుల కృషి సత్ఫలితాలనిచ్చింది. ఇందుకు అనుసరిస్తున్న శాస్త్రీయ విధానాలన్నీ సఫలీకృతమవుతున్నాయి. గడచిన ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం సుస్పష్టమవుతోంది. నాలుగేళ్ల క్రితం కేసుల సంఖ్యలో ఇప్పుడు నమోదవుతున్న కేసుల సంఖ్య 10 శాతమే కావడం మలేరియా నియంత్రణలో పురోగతిని స్పష్టం చేస్తుంది. సాంప్రదాయ పద్ధతులు, శాస్త్రీయ విధానాలు, ప్రజల వ్యక్తిగత శుభ్రత మలేరియా నియంత్రణకు దోహదపడ్డాయని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి తెలిపారు. దోమల నివారణకు సిబ్బంది ఆరు రకాల విధానాలను అనుసరిస్తారు. ఆయా విధానాల్లో నాలుగు దోమల నివారణకు అనుసరిస్తే మిగిలిన రెండు లార్వా నివారణకు వినియోగిస్తామని జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) సింగంశెట్టి భాస్కరరావు తెలిపారు.

దోమల నివారణ ఇలా..


దోమలను రూపుమాపడానికి అనుసరించే ఫాగింగ్ విధానంలో పైరత్రం, టెక్నికల్ మాలాథిన్ వాడతారు. దోమల సాంద్రత అధికంగా ఉన్న చోట వారానికి రెండు సార్లు ఫాగింగ్ చేస్తారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు దోమలు అధికంగా ఉండే అర్బన్ ప్రాంతాల్లోనూ ఈ విధానం ద్వారా దోమల నివారణ చేపడతారని భాస్కరరావు తెలిపారు. స్పేస్ స్ప్రే ద్వారా సైఫనోత్రిన్‌ను ఇళ్ల ఆవరణల్లో పిచికారీ చేస్తారు. దీని వల్ల భూ ఉపరితలం ఉంచి 50 నుంచి 100 అడుగుల ఎత్తులో ఉన్న దోమలు సైతం చనిపోతాయి. దోమల వల్ల వ్యాధులు ప్రబలుతున్న ప్రాంతాల్లోనే స్పేస్ స్ప్రేను వినియోగిస్తారు. మరో విధానం ఇండోర్ రెసిడ్యుయల్ స్ప్రే (ఐఆర్ఎస్) విధానంలో ఆల్ఫా సైపర్ మెత్రిన్ రసాయనాన్ని ఇంటి లోపల గోడల పై పిచికారీ చేస్తారు. గోడ మీద వాలి ద్రావణాన్ని దోమ తిని మరణిస్తుంది. 10 నుంచి 12 వారాల వరకు ప్రభావం ఉంటుంది. దోమల నియంత్రణలో వాడే నాల్గవ విధానం దోమతెరలు(బెడ్‌నెట్స్) వీటిలో లాంగ్ లాస్టింగ్ ఇన్సెక్టిసైడల్ నెట్స్ అంటారు. శాస్త్రీయ విధానాన్ని రంగరించి సిద్ధం చేసిన ఈ దోమ తెరలను రాష్ట్రం థాయిలాండ్ నుంచి కొనుగోలు చేస్తోంది. వీటి తయారీ అనంతరం ప్రత్యేక రసాయనంలో ఉంచి వినియోగంలోకి తెస్తారు. వీటినే జిల్లా వాసులకు అందజేశారు. తెరపై ఉండే డాక్సీ సైక్లిన్ రసాయనం తెరను తాకే దోమలను అక్కడికక్కడే చంపుతుంది. మనుషులకు ఏమాత్రం హాని కారకం కాని, కనిష్టంగా రెండేళ్ల పాటు దోమ తెరపై ఉండే ఈ రసాయనం దోమల నివారణకు తోడ్పడుతుంది.

లార్వా నివారణకు..

ఆదిలోనే అంతం చేసే విధానాలను లార్వా నివారణలో వినియోగిస్తున్నారు అధికారులు. అందులో రెండు రకాల విధానాలు ఉన్నాయి. గంబూషియా చేపపిల్లలను శుభ్రం చేసేందుకు అవకాశంలేని నీటి నిల్వల్లో వదులుతారని డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి తెలిపారు. వీటి ఆహారమే లార్వా కావడంతో దోమ పుట్టుకదశలోనే అంతమవుతుంది. గడచిన రెండేళ్లుగా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే ఫ్రై డే విజయవంతమైందని జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రోణంకి రమేష్ అన్నారు. దోమల సాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో గృహ దర్శనాలు నిర్వహించి నిల్వ నీటి శుద్ధి, పరిసరాల పరిశుభ్రతపై నిర్వాసితులు, ముఖ్యంగా గృహిణులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

నినాదమే.. విధానం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఈ ఏడాది కీలక నినాదాన్ని ప్రతిపాదించిందని కాకినాడ జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు తెలిపారు. జీరో మలేరియా లక్ష్యం దిశగా ఆచరణ, అమలు, ఆవిష్కరణ అనే ప్రతిపాదనను జనాల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. థింక్ గ్లోబల్లీ(ఆలోచన అంతర్జాతీయం), ప్లాన్ లోకల్లీ(ప్రణాళిక స్థానికం), యాక్ట్ ఫోకల్లీ(చర్యలు కేంద్రీకృతం) అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గనిర్దేశంలో మలేరియా నివారణకు వివిధ కార్యక్రమాలు రూపకల్పన చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు.



ఆచరణలో సఫలం.. అంకెల్లో విజయం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2019– 22 మధ్య దోమల నివారణకు వినియోగించే దోమ తెరల పంపిణీ కట్టుదిట్టంగా జరిగింది. 2019లో 1,14,050 కుటుంబాలకు, 2020లో 87,839 కుటుంబాలకు 2021,22లో 3,79,300 కుటుంబాలకు దోమ తెరల పంపిణీ చేపట్టారు. గతేడాది 29 పీహెచ్‌సీల పరిధిలో 640 గ్రామాల్లో 2,26,580 జనాభాకు గాను 2,22,146 మంది ఇళ్లల్లో ఇండోర్ రెసిడ్యుయల్ స్ప్రే చేపట్టారు. 98 శాతం మంది ఈ ప్రయోజనాన్ని పొందారు. 2019లో 646 మలేరియా కేసులు నమోదు కాగా, 2020లో 278 నమోదయ్యాయి. 2021లో 96 కేసులు నమోదైతే, 2022లో 115, 2023 ఏప్రిల్ 16వ తేదీ వరకు 71 కేసులు నమోదైనట్లు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన పంచాయతీలకు పురస్కారం



ఉత్తమ ఫలితాలు సాధించిన గ్రామ సర్పంచులను సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన పంచాయతీ సర్పంచులను ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. రాష్ట్ర స్థాయి అవార్డు సాధించిన కోటనందూరు మండలం బిల్లనందూరు స్ఫూర్తితో మిగిలిన అన్ని పంచాయతీలు పోటీ పడాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన 11పంచాయతీల గ్రామ సర్పంచ్‌లను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి ఆర్ విక్టర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఎవి రమణారెడ్డి, డివిజనల్ అభివృద్ధి అధికారులు పి నారాయణమూర్తి, కెఎన్వీ ప్రసాద్, ఎంపీడీవోలు, సర్పంచులు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

పంచాయతీ సర్పంచుల వివరాలు

- **పేదరిక నిర్మూలన, సుస్థిర జీవనోపాధులు** : యు.కొత్తపల్లి మండలం గోర్స.
- **సుపరిపాలన:** కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ, కొవ్వూరు.
- **ఆరోగ్య పంచాయతీ:** తుని మండలం రాజుపేట, ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు.
- **చైల్డ్ ఫ్రెండ్లీ:** యు కొత్తపల్లి మండలం రమణక్కపేట, తొండంగి మండలం పైడికొండ.
- **తాగునీటి సమృద్ధి:** కరప మండలం పెనుగుదురు.
- **పచ్చదనం, పరిశుభ్రత:** కోటనందూరు మండలం బిల్లనందూరు, తుని మండలం కెఓ మల్లవరం.
- **మౌలిక వసతుల స్వయం సమృద్ధి:** కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు, కరప మండలం పెనుగుదురు.
- **సాంఘిక భద్రత** : కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం.

వైద్యం, ఆరోగ్యానికి అగ్రాసనం

- జీజీహెచ్, ఆర్ఎంసీల్లో మంత్రి విడదల రజిని పర్యటన
- అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న మంత్రి రజిని. చిత్రంలో మంత్రి వేణు, ఎంపీ గీతా తదితరులు



రూ.1.22 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని



పీజీ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి రజిని

కాకినాడ క్రైం: రాష్ట్రంలో వైద్యం, ఆరోగ్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యత దక్కిందని ఆ శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. సోమవారం కాకినాడ జీజీహెచ్, రంగరాయ వైద్య కళాశాలలోని వివిధ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. జీజీహెచ్‌లోని అత్యవసర విభాగాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. న్యూరో సర్జరీ వైద్య విభాగం చేసిన సత్కారాన్ని అందుకున్నారు. ఆర్ఐసీయూ–2 సహా పలు ఐసీయూల నిర్వహణను పరిశీలించారు. అనంతరం శ్రీ రాగిరెడ్డి వెంకట జయరామ కుమార్(ప్రూటీకుమార్) ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రాన్ని మంత్రి సందర్శించి రోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. జీప్లస్ 4 లో నిర్మితం కానున్న మాతాశిశు విభాగాన్ని మంత్రి సందర్శించారు. నిర్మాణ పనులు, మాతా శిశువులకు అందుబాటులోకి రానున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, డాక్టర్ లక్ష్మీనారాయణలు ఎంసీహెచ్ మాప్‌ను మంత్రికి చూపి నిర్మాణ ప్రణాళికను వివరించారు. మంత్రి వెంట జీజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవోలు డాక్టర్ రాహుల్, యమున ఉన్నారు.

రామ్‌కానాకు అభినందన

మంత్రి రజిని, మరో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, జక్కంపూడి రాజా, కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు డీఎంఈ డాక్టర్ డీఎస్ వీఎల్ నరసింహంలతో కలిసి రంగరాయ వైద్య కళాశాలకు వెళ్లారు. పీజీ వైద్య విద్యార్థుల వసతి గృహ నిర్మాణానికి రజనీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్ఎంసీ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ జీజీహెచ్ ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి రామ్‌కానా(పూర్వపు ఆర్ఎంసీ విద్యార్థులు) ముందుకు రావడం హర్షణీయం అన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా దాతల ప్రతిపాదనలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పేదలకు ప్రయోజనం చేకూర్చుతున్నారన్నారు. రంగరాయ వైద్య కళాశాల కీర్తి ప్రతిష్టలు ప్రస్తావిస్తూ ఇక్కడి వైద్యుల ఘనతను కొనియాడారు.

ధర్మదాతకు ఘన సత్కారం

రూ.52 కోట్ల అంచనాతో భవనం నిర్మితం కానుండగా అందులో రూ.12.5 కోట్లు భారీ మొత్తాన్ని దానం చేసిన ఆర్ఎంసీ పూర్వపు విద్యార్థి డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్‌ను మంత్రి విడదల రజిని సహా ఇతర ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. చదువుకున్న కళాశాల రుణం తీర్చుకునేందుకు డాక్టర్ ఉపేంద్రనాథ్ అరుదైన సత్కార్యానికి ముందుకొచ్చారని కొనియాడారు. ఆయనతో పాటు ఎంసీహెచ్ భవన నిర్మాణానికి నిధులు దానం చేసిన దాతలందరికీ పేరుపేరునా మంత్రి ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గీత, ఎంఎల్ఏ ద్వారంపూడి మాట్లాడుతూ డాక్టర్ ఉపేంద్రనాథ్ దాన గుణాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సహా వైద్యాధికారులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ ప్రారంభం

కాకినాడ: కాకినాడ గాంధీనగర్ ప్రాంతంలో రూ.1.22 కోట్ల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ప్రజలకు చేరువగా వైద్యసేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ఈ కొత్త యూపీహెచ్‌సీని నిర్మించారు. దాదాపు నాలుగు డివిజన్లకు సంబంధించి సుమారు 20 వేల మంది ప్రజలకు ఈ యుపీహెచ్‌సీవల్ల వైద్యసేవలు అత్యంత దగ్గరగా అందుబాటులోకి వస్తాయని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంత్రికి వివరించారు. ఆస్పత్రి ఆవరణలోని వివిధ విభాగాలను అతిథులు ప్రారంభించారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జక్కంపూడి రాజా, నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల,కొడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, తదితరులు హాజరయ్యారు.

జిల్లాలో స్పందనకు 314 అర్జీలు

కాకినాడ సిటీ: ప్రజా విజ్ఞాపనల వేదిక స్పందనలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యాలయంలో నిర్వహించిన అర్జీల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి 314 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ స్పందనలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ఒకే సమస్యపై అర్జీలు మరలా మరలా రాకుండా చూడాలన్నారు. అర్జీదారుల సమస్యకు సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా పరిష్కార నివేదికకు జత చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, కేఎస్ఈజెడ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె మనోరమ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

కరకుదురు రైతుల వినతి

పెదపూడి మండలం కరకుదురు గ్రామ పంచాయతీ పరిధిలోని పంట పొలాలకు ఈ రబీ సీజన్లో పూర్తి స్థాయిలో నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కరకుదురు ప్రాంత రైతులు కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి వివరించారు. చింతపల్లిలాకులు, గండ్రేడు, పుట్టకుండా, కుమారప్రియం, కైకవోలు, అరట్లకట్ల గ్రామాల మీదుగా కరకుదురుకు ప్రవహించే గండ్రేడు కాలువ మీద ఎక్కువ సంఖ్యలో పెద్ద పరిమాణంలో తూరలు వేయడంతో పూర్తి స్థాయిలో నీరు అందడంలేదన్నారు.

మెగా పీపుల్ సర్వేకు అనూహ్య స్పందన

- ఇంటింటికీ జగనన్నే మా భవిషత్తు
- జిల్లాలో 85 శాతం పూర్తయిన కార్యక్రమం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: జగనన్నే మా భవిషత్తు కార్యక్రమానికి ఊహించిన దానికన్నా బ్రహ్మాండమైన స్పందన వస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పరిశీలిస్తుంటే జగనన్నకు మహిళల మద్దతు సంపూర్ణంగా ఉందని స్పష్టమవుతోందన్నారు. జిల్లాలో మెగా పీపుల్ సర్వే చురుగ్గా జరుగుతోందన్నారు. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో సఫలీకృతమవుతున్నామన్నారు. స ర్వేలో తాము వేస్తున్న ఐదు ప్రశ్నలకు ప్రజలు సానుకూలంగా స్పందించి మా నమ్మకం నువ్వే జగనన్నా అంటున్నారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్తున్నారన్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారన్నారు. రాష్ట్రంలో తొలి 15రోజుల్లో జగనన్న పాలనకు మద్దతుగా 79లక్షల మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. సర్వేలో కోటి కుటుంబాలను కలుసుకున్నామన్నారు. ఈనెల 29వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

విపక్షాలు వాస్తవాలు తెలుసుకోవాలి

ప్రతిపక్షాలు వాస్తవాలు తెలుసుకోకుండా అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని కన్నబాబు విమర్శించారు. జగన్, ఆయన కుటుంబ సభ్యుల గురించి లేనివి ఉన్నట్టు, ఉన్నవి లేనట్టు చిత్రీకరించి ప్రచారం చేయాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వ దృష్టిని ప్రజల వైపు నుంచి మళ్లించలేరన్నారు. ఒక ఇంట్లో రూ.12 లక్షల వరకు సంక్షేమ పథకాల లబ్ధి పొందారని తెలిసి ఆశ్చర్యపోయామన్నారు. అమ్మ ఒడి ఎందుకు ఇవ్వాలని చంద్రబాబు ప్రశ్నిస్తున్నారన్నారు. దీని ద్వారా పిల్లలకు జగన్ ఆర్థిక భరోసా ఇస్తున్నారని గుర్తించాలన్నారు. నాడు- నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చివేశారన్నారు. జిల్లాలోని ఏడు నియోజవర్గాలలో చాలా ఉత్సాహంగా జగనన్నే మా భవిషత్తు కార్యక్రమం జరుగుతోందన్నారు. ఇప్పటికే 80నుంచి 85శాతం గృహాలకు చేరుకున్నామన్నారు. 29 నాటికి పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో గోపుశెట్టి బాబ్జీ, మోషే, కరీం భాషా తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ పరిధిలో సారా, ఇతర నే రాల్లో పట్టుకున్న 9 వెహికల్‌ మోటారుసైకిళ్లు, ఇంజిన్ బోటుకు ఈనెల 29వ తేదీ ఉదయం 8 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ సోమవారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు, రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

క్లుప్తంగా

శ్రీ ప్రకాష్ స్కూల్ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): శ్రీ ప్రకాష్ సురేష్‌నగర్ పాఠశాల 3, 5 తరగతుల విద్యార్థుల స్నాతకోత్సవం సోమవారం సాయంత్రం నిర్వహించారు. వాయిస్ ఆఫ్ స్పీడ్ ట్రైనర్, డైరెక్టర్ జిల్‌మిల్ హాజరికా ముఖ్యఅతిథిగా హాజరై షేక్ స్పియర్ రచించిన హ్యామ్లెట్, గ్రీకు రచయిత యూరిపిడస్ రచించిన మీడియా రెండింటిని కలిపి స్త్రీ సాధికారత కోసం రచించిన కిల్ నాట్ టు కిల్ అనే నాటకం ప్రదర్శించారు. మరో ముఖ్య అతిథి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా డైరెక్టర్ అభిలాష్ పిళ్లై (కేరళ) మాట్లాడుతూ చిన్న వయస్సులో ఏవిషయాలపై ఆసక్తి ఉందో గ్రహించి వారిని ఆ విధంగా ప్రోత్సహించాలన్నారు. స్మార్ట్ షేక్‌స్పియర్, రాకింగ్ రామానుజన్, నంబర్ క్రంచర్, పద్య యోధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ శివప్రసాద్, పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ఎస్ మూర్తి, ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రుణగొణ ధ్వనులకు మంగళం

- మహిళా సంఘాల లెక్క..ఇక పక్కా
- పొదుపు..రుణ వివరాల్లో పారదర్శకత
- మే నుంచి అందుబాటులోకి 'లోకోస్' యాప్ సేవలు
- వినియోగంపై వీవోఏ, ఏపీఎం, సీసీలకు శిక్షణ
- కోనసీమ జిల్లాలో 38,450 మహిళా శక్తి సంఘాలు



మహిళా శక్తి సంఘాల సభ్యులు

రాయవరం: పొదుపు సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉండనున్నాయి. సంఘంలోని మహిళలు పొందే రుణాలు, వారు చెల్లిస్తున్న వడ్డీ, సంఘాల కార్యకలాపాలు, పొదుపు వివరాల్లో పూర్తి పారదర్శకత చోటు చేసుకోనుంది. ఎక్కడా లోపం లేకుండా పర్యవేక్షణ జరుగనుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ నూతన అప్లికేషన్‌ను రూపొందించింది. డ్వాక్రా సంఘాల్లో జరుగుతున్న ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన, వారు నిర్వహిస్తున్న వ్యాపారం, పొందుతున్న లాభాలు తదితర సమాచార వివరాల పక్కాగా ఉండే విధంగా కొత్తగా 'లోకోస్' అనే యాప్‌ను మే నెల నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు. దేశవ్యాప్తంగా పొదుపు సంఘాల వివరాలన్నీ ఈ యాప్ ద్వారా ఒకే గొడుగు కిందకు రానున్నాయి. గ్రామీణ జీవనోపాదుల మిషన్ (నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్) ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

వేర్వేరు యాప్‌లకు స్వస్తి

ఇప్పటి వరకు పొదుపు సంఘాల వివరాలను వేర్వేరు యాప్‌ల్లో నమోదు చేస్తున్నారు. సంఘాల పనితీరు..ఆర్థిక లావాదేవీలు, ఇతర వివరాల నమోదుకు ఒక్కో యాప్‌ను వినియోగించేవారు. మహిళా శక్తి సంఘాల్లోని సభ్యుల వ్యక్తిగత వివరాలు, వారి ఆర్థిక పరిస్థితి, సంఘాల ఆర్థిక లావాదేవీలన్నీ ఇకపై ఒకే యాప్‌లో నమోదు చేయనున్నారు. దీని వలన సమగ్ర సమాచారం ఒకేచోట లభిస్తుంది. డిజిటలైజేషన్‌లో భాగంగా ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత

ప్రధానంగా పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక రుణాలపై పారదర్శకత ఉండే విధంగా ఈ యాప్ ఉపయోగపడనుంది. భవిష్యత్తులో ఆధార్ ప్రామాణికంగా రుణాలు మంజూరయ్యే అవకాశముంది. ఎక్కడైనా రెండు, మూడు సంఘాల్లో సభ్యులుగా ఉంటూ, వేర్వేరు చోట్ల రుణాలు పొందడానికి ఇకపై అవకాశముండదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 38,450 మహిళా శక్తి సంఘాలున్నాయి. ఈ సంఘాల్లో 3,99,333 మంది సభ్యులుగా ఉన్నారు. సంఘాల్లో ఉన్న సభ్యులు తీసుకుంటున్న రుణాలు, చెల్లిస్తున్న రుణ వాయిదాలకు సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. దీనివల్ల ఎక్కడా లోపం లేకుండా పర్యవేక్షణ సులువుగా ఉంటుంది. తద్వారా పనిభారం తగ్గి సమయం కలిసి వస్తుంది. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో, వైఎస్సార్ క్రాంతి పథం సంస్థ సారథ్యంలో స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు పర్యవేక్షిస్తారు. ఇకపై మహిళా శక్తి సంఘాల సమాచారంతో పాటు, గ్రామ సంఘాల సమాచారం కూడా ఈ యాప్ ద్వారానే పర్యవేక్షిస్తుంటారు.

త్వరలోనే శిక్షణ పూర్తి

ప్రస్తుతం లోకోస్ యాప్ వినియోగంపై రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన జిల్లా రీసోర్స్ పర్సన్స్ ఎంవీఎల్ కుమారి, డి.వరాలబాబు, జి.దుర్గాప్రసాద్, టి.జోగారావు, హైమాప్రశాంతి, సాయికుమారి శిక్షణనిస్తున్నారు. గ్రామ సంఘాల అసిస్టెంట్లు (వీవోఏ), అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు (ఏపీఎం), క్లస్టర్ కోఆర్డినేటర్ల (సీసీ)కు జిల్లా స్థాయిలో శిక్షణనిస్తున్నారు. ప్రతి మండలం నుంచి ముగ్గురు వీవోఏలు, ఒక్కొక్క ఏపీఎం, సీసీలకు శిక్షణ ఇస్తున్నారు. లోకోస్ యాప్ ప్రధాన ఉద్దేశం, యాప్‌ను ఎలా వినియోగించాలి? ఆర్థిక లావాదేవీలు ఎలా నమోదు చేయాలి? నమోదు అనంతరం నివేదికలను ఎలా పరిశీలించాలి? తదితర అంశాలపై మూడు రోజుల వంతున శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని సఖినేటిపల్లి, రాజోలు, మలికిపురం, మామిడికుదురు, పి.గన్నవరం, అల్లవరం, అమలాపురం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాలలకు ఐదుగురి వంతున 55 మందికి శిక్షణ పూర్తి చేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు కొత్తపేట, అయినవిల్లి, ఆలమూరు, అంబాజీపేట, ఆత్రేయపురం, రావులపాలెం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, మండపేట, రామచంద్రపురం, రాయవరం మండలాల పరిధిలోని వారికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన వీవోఏలు, ఏపీఎం, సీసీలు తిరిగి మండల స్థాయిలో గ్రామ సంఘాల సహాయకులకు శిక్షణ ఇస్తారు.

LokOS
CBO Mobile Application

'లోకోస్' యాప్ లోగో

ఒకే యాప్‌లో సమగ్ర సమాచారం



లోకోస్ యాప్ వల్ల పొదుపు సంఘాల సమగ్ర సమాచారం ఒకచోటే లభిస్తుంది. యాప్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని రాగానే పొదుపు సంఘాల సమాచారాన్ని అందులో నమోదు చేస్తాం. దీనివల్ల సంఘాలు, సభ్యులకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది. ఇది వరకు వేర్వేరు యాప్‌ల్లో నమోదు చేయడం ద్వారా వాటిని సేకరించేందుకు సమయం పట్టేది. ప్రస్తుతం ఈ యాప్‌తో అటువంటి సమస్య ఉండదు.

– డాక్టర్ డి.శివశంకరప్రసాద్, పీడీ, డీఆర్‌డీఏ, అమలాపురం

తృటిలో తప్పిన ప్రమాదం



పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న దొరబాబు

పెద్దాపురం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఒక కార్పొరేట్ పాఠశాల నిర్లక్ష్యం కారణంగా సుమారు 15 మంది విద్యార్థులకు పెను ప్రమాదం తృటిలో తప్పిన ఘటన సోమవారం పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురం రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సామర్లకోటలోని ఒక కార్పొరేట్ స్కూల్ నుంచి పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురం, కొండపల్లి గ్రామాలకు వెళ్లే విద్యార్థుల బస్సు వాలుతిమ్మాపురం రోడ్డులో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా ప్రమాదం జరిగిన సమయంలో 15 మంది సురక్షితంగా బయట పడ్డారు.

స్థానికులు సత్వరమే స్పందించి విద్యార్థులను బయటకు తీయడంతో ఊపిరిపీల్చుకున్నారు. విద్యార్థులను పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై పెద్దాపురం ఎస్ఐ వెలుగుల సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒంటిపూట బడులు నడుస్తున్న సమయంలో సాయంత్రం వరకు విద్యార్థులను ఉంచడంపై స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై ఎస్ఐని వివరణ కోరగా సామర్లకోటలో బ్రాంచి యాజమాన్యం నిర్లక్ష్యంపై విచారణ చేపడతామని అన్నారు.

ఘనంగా వైదిక కార్యక్రమాలు



వైదిక కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: ఈ నెల 30వ తేదీ నుంచి జరగనున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే వైదిక పరమైన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. సోమవారం ఆయన దేవస్థానం వేద పండితులు, అర్చకులతో సమావేశమయ్యారు. 30వ తేదీన స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసే కార్యక్రమం మొదలుకుని మే ఒకటో తేదీన సత్యదేవుని దివ్య కల్యాణం, రెండో తేదీ అరుంధతి దర్శనం, మూడో తేదీన వేదపండిత సదస్యం, నాలుగో తేదీన వనవిహారం, ఐదో తేదీన చక్రస్నానం, ఆరో తేదీన శ్రీపుష్పయాగం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు అవసరమైన పూజా సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు.

సమావేశంలో వైదిక కమిటీ సభ్యులు వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు ముత్య సత్యనారాయణ, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కరప: మండలం జి.భావారంలో పేకాట శిబిరంపై కరప పోలీసులు దాడి చేసి, ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ కథనం మేరకు జి.భావారం గ్రామ పొలిమేరలో పేకాటాడుతున్నట్టు సోమవారం కరప పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేశారు.

ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4,910 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కాకినాడ కోర్టులో హాజరుపరచినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



రామకృష్ణ మృతదేహం

ప్రత్తిపాడు: చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి గ్రామంలో సోమవారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు తుని మండలం ఎస్.ఎ స్.వెంకటనగరం గ్రామానికి చెందిన పంపనబోయిన రామకృష్ణ (35) కొంతకాలంగా ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి గ్రామంలో బంధువుల ఇంట నివసిస్తున్నాడు. సోమవారం తాటాకుల కోసం గ్రామానికి చెందిన జంపన రాంబాబు పొలంలోని తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం. పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..



ఘటనాస్థలం వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం: మండలంలోని జల్లూరు వద్ద పిఠాపురం - సామర్లకోట రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు పిఠాపురం రూరల్ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం గొల్లప్రోలు కొత్తపేటకు చెందిన కసిరెడ్డి శివకుమార్ పెద్దాపురంలో ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తన మోటారు సైకిల్‌పై పెద్దాపురం వెళుతుండగా పిఠాపురం మండలం జల్లూరు వద్ద పిఠాపురం సామర్లకోట రోడ్డులో ఒక్కసారిగా గేదె అడ్డురాగా సడన్ బ్రేక్ వేయడంతో కింద పడిపోయాడు. ఇంతలో సామర్లకోట నుంచి పిఠాపురం వెళుతున్న గుర్తుతెలియని మోటారు సైకిలిస్టు ఢీకొట్టడంతో శివకుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే పడిపోయాడు. ఇంతలో స్థానికులు వచ్చి అతనిని తీసి పక్కనే ఉన్న చెట్టు కింద పడుకోబెట్టి అంబులెన్సుకు సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. అతని తండ్రి కసిరెడ్డి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పిఠాపురం రూరల్ ఎస్సై అబ్దుల్‌నబీ తెలిపారు.

కళ చల్ల'కుండ'



పెద్దాపురంలో శిల్పి సాయి తయారు చేసిన అతి చిన్న మట్టి కుండ

పెద్దాపురం: మండు వేసవిలో చల్లని నేస్తం కుండ.. దానిని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు గ్రహీత, పెద్దాపురం పట్టణ బంగారు శిల్పి తాళాబత్తుల సాయి అతి సూక్ష్మంగా తయారు చేసి ఆకట్టుకున్నారు. రెండు గంటల వ్యవధిలో 100 మిల్లీ గ్రాముల బంక మట్టితో కుండను తయారు చేశారు. ఇది అందరినీ ఆకర్షిస్తోంది.